ప్రజాశక్తి
సోమవారం 12 ఫిబ్రవరి 2024 | 5 | శ్రీకాకుళం

బొల్లినేని మెడ్‌స్కిల్స్‌లో నూతన కోర్సులు

శ్రీకాకుళం అర్బన్ : హెచ్‌పిసిఎల్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడ్‌స్కిల్స్ సంయుక్తంగా బ్యుటీషియన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులు చేసేందుకు ఇంటర్, పదో తరగతి పూర్తి చేసి, 18 నుంచి 28 ఏళ్ల లోపు పురుషులు, మహిళలు అర్హులని పేర్కొన్నారు. మూడు నెలల శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు 7680945357, 9121999654 సెల్ నంబర్లకు ఫోన్ చేసి, తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు శ్రీకాకుళం మండలం రాగోలు జెమ్స్ హాస్పిటల్ క్యాంపస్‌లో సంప్రదించాలని సూచించారు.

మాట ఇచ్చి మోసం చేశారు

- సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- అధికారంలోకి వస్తే పూర్తి చేస్తాం
- జీడిపిక్కలకు మద్దతు ధర కల్పిస్తాం
- మంత్రి అప్పలరాజు కొండలను మింగేస్తున్నారు
- 'శంఖారావం'లో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీనిచ్చిన వైసిపి ప్రభుత్వం వాటిని పూర్తి చేయకుండా రైతులను మోసం చేసిందని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. వచ్చే ఎన్నికలకు కేడర్‌ను సమాయత్తం చేసేందుకు చేపట్టిన శంఖారావం యాత్ర ఇచ్ఛాపురంలో ఆదివారం ప్రారంభమైంది. ఈసందర్భంగా ఇచ్ఛాపురం, పలాస, టెక్కలిలో నిర్వహించిన బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. జిల్లాకు సంబంధించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 60 హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. వంశధార, నాగావళి నదుల అనుసంధానం, ఆఫ్‌షోర్, కరకట్టల పనులు పూర్తి చేయకుండా అర్ధాంతరంగా వదిలేశారని చెప్పారు. కోకోనట్ పార్కును ఏర్పాటు చేస్తామన్నారని, కనీసం బాహుదా ఛానల్ మరమ్మతులు అయినా చేశారా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో జగన్మోహన్ రెడ్డి జిల్లాకు చేసిందేమిటని ప్రశ్నించారు. రెండు నెలలు ఓపిక పడితే టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని హామీనిచ్చారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌ను మొదటి మూడేళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు. జిల్లాలో జీడి రైతుల సమస్యలను తెలుసుకున్నామని, అధికారంలోకి వచ్చిన వెంటనే పిక్కలకు మద్దతు ధర ప్రకటిస్తామని హామీనిచ్చారు. జీడి పరిశ్రమలూ సంక్షోభంలో ఉన్నాయని, వాటినీ ఆదుకుంటామని చెప్పారు. కొబ్బరి, జీడిపప్పు రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. పలాసలో డిఫెన్స్ ఆర్మీ కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఉత్తరాంధ్రలో సెజ్ ఏర్పాటు చేసి పెద్దఎత్తున పరిశ్రమలు తీసుకువస్తామన్నారు. జిల్లాలో మత్స్యకారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వలలు, బోట్లు, ఐస్ బాక్సులు కూడా సబ్సిడీ ఇవ్వలేదన్నారు. తాము అధికారంలోకి వస్తే గతంలో కన్నా రెట్టింపు సాయం అందిస్తామని హామీనిచ్చారు. పలాసలో టిడ్కో ఇళ్లు పూర్తి చేసి వంద రోజుల్లో లబ్ధిదారులకు అందిస్తామన్నారు.

గజమాలతో సత్కరిస్తున్న టిడిపి శ్రేణులు

మంత్రి అప్పలరాజుపై తీవ్ర విమర్శలు

పలాసలో మంత్రి అప్పలరాజు కొండలను సైతం మింగేస్తున్నారని ఆరోపించారు. ఐదేళ్ల పాలనలో మంత్రి అప్పలరాజు ఒక్క అభివృద్ధి పనిచేయలేకపోయారని విమర్శించారు. పలాసలో రూ.12 కోట్లతో లాడ్జి ఎలా కొన్నారో ప్రజలకు చెప్పాలన్నారు. అంగన్వాడీ, ఆశావర్కర్ల పోస్టులనూ అమ్ముకుంటున్నారని చెప్పారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేకపోయినా తన ప్రగతిభవన్‌ను మాత్రం వేగంగా పూర్తి చేసుకున్నారని విమర్శించారు. తన సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలనూ వదలకుండా వేధింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. పలాసలో ఐదుగురు మహిళలు ఎక్కడ, ఎలా చనిపోయారో తెలియదని, ఆ కుటుంబాలకూ న్యాయం చేయలేదన్నారు. టిడిపి, జనసేన ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వంద రోజుల్లో కుటుంబాలకు న్యాయం చేసే బాధ్యత తీసుకుంటానని చెప్పారు.

కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి

టిడిపి, జనసేన మధ్య చిచ్చులు పెట్టేందుకు వైసిపి పేటిఎం బ్యాచ్ ప్రయత్నిస్తుందని, అందుకు రెండు పార్టీల నాయకులు కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. శంఖారావం ద్వారా మనం ప్రతి ఇంటికీ వెళ్లాలని, చంద్రబాబు సూపర్ సిక్స్ కార్యక్రమాలు ప్రజలకు చేరేలా ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా తీసుకెళ్లిన వారికి నామినేట్ పదవులు కట్టబెడతామని చెప్పారు.

ఎక్కువ కేసులున్న వారికి నామినేటెడ్ పోస్టు

2019 నుంచి 2024 వరకు ఎవరిపై ఎక్కువ కేసులు ఉన్నాయో వారికి నామినేటెడ్ పోస్టు ఇస్తానని ప్రకటించారు. జిఒ 70 ద్వారా జగన్ పోలీసుల పొట్ట కొట్టారని, అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆ జిఒను రద్దు చేస్తామన్నారు. అదనపు సరెండర్ లీవ్స్, ట్రావెల్ అలవెన్స్, నక్సల్స్ ఏరియా అలవెన్స్ కూడా తిరిగి తీసుకొస్తామన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలన్నీ చెల్లిస్తాం. టెక్కలి టిడిపి కంచుకోట అని, ఆనాడు ఎన్‌టిఆర్ టెక్కలి నుంచి పోటీ చేసి గెలిచారని గుర్తుచేశారు. ఆ ఘనతను అచ్చెన్నాయుడు ముందకు తీసుకెళ్తున్నారని, టెక్కలిలో హ్యాట్రిక్ కొట్టబోతున్నామని తెలిపారు.

టెక్కలిని జిల్లా కేంద్రం చేస్తాం

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే టెక్కలిని జిల్లా కేంద్రంగా చేస్తానని టెక్కలి ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం దివాళా తీసిందన్నారు. బటన్ నొక్కడాల్లో ఆక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. టిడిపి ప్రభుత్వం వచ్చాక అచ్చెన్నాయుడుకు హోం మంత్రి పదవి ఇవ్వాలని ఎంపీ రామ్మోహన్ నాయుడు కోరగా, అది తన చేతుల్లో లేదని లోకేష్ స్పషం చేశారు.

దుష్టపాలన అంతానికి శంఖారావం

రాష్ట్రంలో వైసిపి రాక్షస పాలన అంతానికి లోకేష్ సమర శంఖారావం పూరించారని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. జగన్ పాలనలో అన్ని తరగతుల ప్రజలు మోసపోయారని విమర్శించారు. పలాస నియోజకవర్గం పరిధిలో కొండలను మింగేసిన మంత్రి అప్పలరాజు, వాటి వద్దకు వెళ్లి సెల్ఫీ తీసుకోవాలని ఎద్దేవా చేశారు. మత్స్యకార మంత్రిగా ఉన్న అప్పలరాజు మత్స్యకారులకే మేలు చేయలేదని విమర్శించారు.

ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ మాట్లాడుతూ ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి లేదన్నారు. రాక్షస పాలకుడితో పోరాడేందుకు కార్యకర్తలంతా నడుం బిగించాలని పిలుపునిచ్చారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మాట్లాడుతూ కిరాయి గుండాలతో మంత్రి అప్పలరాజు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు తెచ్చిన డయాలసిస్ సెంటర్లు, కిడ్నీ ఆసుపత్రి, పరిశోధన కేంద్రం వారి గొప్పగా చెప్పుకుంటున్నారని తెలిపారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేయాలని లోకేష్‌ని కోరారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, మాజీ మంత్రి గౌతు శివాజీ, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, టిడిపి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు పి.చంద్రమోహన్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు దాసరి రాజు, వి.దుర్గారావు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

పలు సమస్యలపై వినతులు

శంఖారావం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన లోకేష్‌కు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై పలువురు వినతిపత్రం సమర్పించారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని, ఈ అంశాన్ని మేనిఫెస్టోలో చేర్చాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి తదితరులు వినతిపత్రం అందజేశారు. పెండింగ్ బకాయిలను చెల్లించాలని, 117 జిఒను రద్దు చేయాలని కోరారు. ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని ఎపి సిపిఎస్ఇఎ నాయకులు వినతిపత్రం అందించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో సంప్రదాయ మత్స్యకార కంద్ర కులస్తులను ఎస్‌టిలుగా గుర్తించడంతో పాటు చట్టసభల్లో అవకాశం కల్పించాలని ఆ సామాజిక తరగతి నాయకులు విన్నవించారు. సాంకేతిక కారణాల వల్ల తిత్లీ తుపాను పరిహారం పొందలేని ఏడు వేల మందికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వంశధార-బాహుదా నదిని అనుసంధానించి ఇచ్ఛాపురం నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించాలని రైతులు విన్నవించారు. జిల్లాలో 1998 డిఎస్‌సి క్వాలిఫై అయిన 350 మందిని రెగ్యులరైజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో బెంతో ఒరియాలకు ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రాలు ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు. గోపాలమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఎక్స్ సర్వీస్‌మెన్లను అన్ని విధాలుగా ఆదుకోవాలని మాజీ సైనికులు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో 40 వేల మందికి పైగా ఉన్న ఆర్ఎంపి, పిఎంపిలకు గుర్తింపు సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆర్ఎంపిలు విన్నవించారు. అగ్రిగోల్డ్ కంపెనీ మోసానికి బలైన తమకు న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ బాధితులు కోరారు.

ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

అభివృద్ధి కనిపించడం లేదా?

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ప్రతిపక్ష నాయకులు మాట్లాడాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించే వాళ్లని కళ్లు ఉన్నా చూడలేని వాళ్లని... చెవులు ఉండి వినలేని వాళ్లని, నిద్ర నటించే వాళ్లని ఏం అనగలమని దుయ్యబట్టారు. మండలంలోని శ్రీపురం పంచాయతీలో రూ.80 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం కోసం మాట్లాడుతున్న విపక్ష నేత చంద్రబాబు నాయుడు పక్క రాష్ట్రంలో ఉంటున్నారని చెప్పారు. ఆయన వ్యాపారాలన్నీ పక్క రాష్ట్రంలో ఉంటే అదనంగా ఇక్కడ సిఎం పదవి కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. అలాంటి వాళ్లు రాష్ట్ర ప్రయోజనాల కోసం మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. టిడిపి హయాంలో జన్మభూమి కార్యకర్తలు దోచుకున్నారని ఆరోపించారు. పథకాల వర్తింపు కోసం ప్రజలు అర్జీలు పెట్టుకుంటే కలెక్టర్లు సైతం జన్మభూమి కమిటీ సభ్యులను కలవమని చెప్పేవాళ్లని చెప్పారు. ఇవాళ విపక్ష, కక్షసాధింపు ఉన్నాయని చెప్తున్న లోకేష్, గ్రామాలకు వచ్చి చూస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. ప్రజలకు లోకేష్, చంద్రబాబు ఎప్పుడో దూరమైపోయారని చెప్పారు. వాస్తవాలు గుర్తించకుండా అబద్ధాలు, అన్యాయాలతో ప్రజల ముందుకు వెళ్తున్నారని ధ్వజమెత్తారు. కొంతమంది సినీ నటులు అప్పుడప్పుడూ కనిపిస్తుంటారని, వాళ్లే వాలంటీర్లు వద్దని అంటున్నారని తెలిపారు. వాలంటీర్లు ప్రజలకు చేస్తున్న సేవ పక్క రాష్ట్రంలో ఉన్న వారికి ఏం అర్థమవుతుందని ప్రశ్నించారు. చంద్రబాబు పాలనలో ఏం చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు.

వైసిపి ప్రభుత్వంలో 2.5 లక్షల శాశ్వత ఉద్యోగాలు గ్రామ వార్డు సచివాలయంలో ఇచ్చామన్నారు. 56 వేల ఉద్యోగాలను వైద్యారోగ్యశాఖలో భర్తీ చేశామని చెప్పారు. వీటి విషయమై ఎవరైనా, ఎక్కడైనా లంచం ఇచ్చారా అని ప్రశ్నించారు. జిల్లాలో కిడ్నీ బాధితుల కోసం రూ.200 కోట్లతో డయాలసిస్ సెంటర్, రూ.700 కోట్లతో ఉద్దాన ప్రాంతానికి రక్షిత మంచినీటి పథకం, రూ.నాలుగు వేల కోట్లతో మూలపేట పోర్టు నిర్మాణ పనులను పూర్తి చేశామని చెప్పారు. నేరడి బ్యారేజీపై ఒడిశాతో ఉన్న వివాదం కొలిక్కి రాకపోవడంతో గొట్టా దగ్గర లిఫ్ట్ పెట్టి ప్రాజెక్టును నింపబోతున్నామన్నారు. రూ.185 కోట్లతో చేపడుతున్న పనులు మరో నాలుగు నెలల్లో పూర్తవుతాయన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఖజానాను లూటీ చేస్తే, వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రజల ఖాతాల్లోకి నగదు వేసి ఆ కుటుంబం బాగుండాలని భావించామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి అంబటి నిర్మల, జెడ్‌పిటిసి రుప్ప దివ్య, డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, జిల్లా రైతు విభాగం అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, ఎఎంసి చైర్మన్ మూకళ్ల తాతబాబు, వైసిపి మండల అధ్యక్షులు చిట్టి జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆ దమ్ము లోకేష్‌కు ఉందా?

- అభివృద్ధిపై చర్చకు సిద్ధం
- రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

మీకు మంచి జరిగితేనే ఓటు వేయండనే దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని, అలా అడిగే దమ్ము చంద్రబాబు, లోకేష్‌కు ఉందా అని రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. కాశీబుగ్గలోని ప్రగతి భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోకేష్, చంద్రబాబు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు ఉత్తరాంధ్రకు ఒక్క పరిశ్రమను తీసుకురాకుండా ఉత్తరాంధ్రను వలసల అంధ్రాగా మార్చారని విమర్శించారు. శంఖారావం పేరుతో లోకేష్ చేస్తున్న పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలని సూచించారు. చేసిన అభివృద్ధిని లేక మైకు దొరికితే తండ్రీ కొడుకులు జగన్‌ను, వైసిపి నాయకులను తిట్టడమే పనిగా పెట్టుకుంటున్నారని విమర్శించారు. ఉత్తరాంధ్రకు చంద్రబాబు చేసిందేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ హయాంలో ఉత్తరాంధ్రలో మూలపేట పోర్టు, భోగాపురం ఎయిర్‌పోర్టు, వంశధార ఫేజ్-2, నదుల అనుసంధానం ఇతర అభివృద్ధి పనులతో ఉత్తరాంధ్రలో వలసల నివారణకు కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం 5.6 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని, ఐదేళ్ల కాలంలో ముఖ్యమంత్రి జగన్ 2.2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారని చెప్పారు. 1.43 లక్షల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇచ్చారని చెప్పారు. ఉద్యోగాల కల్పన గురించి లోకేష్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అభివృద్ధి పై నిర్మాణాత్మక చర్చకు తాను సిద్ధమన్నారు. ఎక్కడకు రమ్మన్నా వస్తానని, లోకేష్ ఎదురుగా కూర్చొని ఆయనకు తెలీని విషయాలు తెలియజేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. తనను కొండలరాజు అంటున్నారని, ఆ కొండల దగ్గరకు చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. రూ.606 కోట్ల అక్రమాస్తులు తనకు ఉన్నాయని చెప్తున్నారని, గౌతు కుటుంబీకులు బినామీలుగా ఉన్న వాటిని పంచేందుకు తాను సిద్ధపడుతున్నానని చెప్పారు.

మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

అక్రమ రవాణాపై పటిష్ట నిఘా

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం, లావేరు

సరిహద్దు తనిఖీ కేంద్రాల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలోని హెడ్ కానిస్టేబుల్ నుంచి ఇన్‌స్పెక్టర్ వరకు గల అధికారులకు జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో ఎన్నికల విధులు, నియమావళిపై మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణా కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఎన్నికల ముందు, తర్వాత అధికారులు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎన్నికల నియమాలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసినప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం విధులు నిర్వహించడంపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎప్పటికప్పుడు గ్రామాలను సందర్శించి పరిస్థితులపై అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. గత ఎన్నికల్లో కేసులను పరిగణలోకి తీసుకొని పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని చెప్పారు. మద్యం, నగదు అక్రమ రవాణాపై దృష్టి కేంద్రీకరించి, స్వాధీనంలో నిబంధనల మేరకు జాగ్రతలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పి వై.శృతి, డిపిటిసి డిఎస్‌పి విజయ్ కుమార్, శ్రీకాకుళం రూరల్ సిఐ ఎల్.సన్యాసినాయడు, డిపిటిసి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. లావేరు మండలంలోని బుడుమూరులో బుడుమూరు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన గ్రంథాలయం (బుడుమూరు విజ్ఞాన కేంద్రం)ను ఎస్‌పి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత దేశానికి వెన్నెముక వంటి వారని చెప్పారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న ప్రతి పుస్తకాన్ని చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండడానికి ఇదో మంచి అవకాశమని చెప్పారు. యువత అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, మంచి విజ్ఞానాన్ని సంపాదించి మన దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ప్రమాద రహిత రవాణా అందరి బాధ్యత

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రమాద రహిత రవాణా అందరి బాధ్యత అని జిల్లా ప్రజా రవాణా అధికారి విజయ్ కుమార్ అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం-1, 2 డిపోల్లోని ఆర్‌టిసి సిబ్బందితో రహదారి భద్రతకు డ్రైవర్లు పాటించాల్సిన నియమాలపై ప్లకార్డులతో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ కూడలి, డేఅండ్‌నైట్ కూడలి, విజయ గణపతి ఆలయం వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాద రహిత రవాణా వ్యవస్థ తీసుకురావడానికి ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. రహదారి నిబంధనలను వాహనదారులు, పాదచారులు విధిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం రెండో డిపో మేనేజర్ రవిశంకర్ శర్మ, సహాయ మేనేజర్లు రమేష్, గంగరాజు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించకపోతే ఉద్యమం తప్పదు

ప్రభుత్వానికి వైసిపి నాయకుల హెచ్చరిక

ప్రజాశక్తి - నౌపడ

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టులో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించకపోతే ఉద్యమం తప్పదని స్థానిక వైసిపి నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. భావనపాడులో సర్పంచ్ బి.మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోర్టు కోసం భూములు ఇచ్చిన రైతులతో పాటు మూలపేట, విష్ణుచక్రం గ్రామాల ప్రజలకు, స్థానిక నాయకులకు పోర్టు పనుల్లో ప్రాధాన్యత కల్పించకుండా స్థానికేతరులకు ఉపాధి కల్పిస్తున్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై మండిపడ్డారు. వారం రోజుల్లోగా తమకు తగిన ప్రాధాన్యత కల్పించుకుంటే రిలే దీక్షలు చేపట్టడంతో పాటు తదుపరి ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేయనున్నట్లు ప్రకటించారు. అప్పటివరకు పార్టీ కార్యక్రమాల్లో సైతం పాల్గొనబోమని స్పష్టం చేశారు. సమావేశంలో వైసిపి మండల అధ్యక్షుడు, మూలపేట సర్పంచ్ జీరు బాబూరావు, లక్కివలస సర్పంచ్ వీరాస్వామి, కో ఆప్షన్ సభ్యులు హన్నూరావు, నౌపడ-2 ఎంపిటిసి సుధాకర్, ఎఎంసి చైర్మన్ తనయుడు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తీరంలో ఆలివ్‌రిడ్లే తాబేళ్ల మృత్యువాత

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సముద్ర జలాల్లో కాలుష్యం ఏరివేతలో ముఖ్య భూమిక పోషించే ఆలివ్ రిడ్లే తాబేళ్లకు కష్టమొచ్చింది. అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్ల సముద్రంలో మృత్యువాత పడుతూ ఒడ్డుకు కొట్టుకొస్తున్నాయి. ఆదివారం ఓ తాబేలు మృతి చెంది ఒడ్డుకు చేరుకుంది. మండలంలోని అక్కుపల్లి, గుణుపల్లి, నువ్వలరేవు, కొత్తపేట, మంచినీళ్లపేట, డోకులపాడు, మెట్టూరు, కంబాలరాయుడుపేట సముద్ర తీరాలకు తరచూ కొట్టుకొస్తున్నాయి. అక్కుపల్లి సముద్ర తీరానికి పదుల సంఖ్యలో మృత్యువాత పడిన తాబేళ్లు కొట్టుకొస్తున్నాయి. చేపల వేటకు వివియోగించే బోట్లకు, వలలకు తగిలి మృతి చెందుతున్నాయి. తీరంలోని ఇసుకలో గుడ్లు పెట్టేందుకు వస్తున్నప్పుడు ఇలా చనిపోతున్నాయి. తాబేళ్ల కళేబరాలు వల్ల తీరంలో దుర్గంధం వ్యాపిస్తుంది. అక్కుపల్లి శివసాగర్ బీచ్ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుంది. కలేబరాల దుర్గంధంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. సముద్ర జలాలను శుభ్రపరిచే తాబేళ్లు చనిపోతుండడంతో పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సముద్ర అలివ్ రిడ్లే తాబేళ్లను సంరక్షించాలని పలువురు కోరుతున్నారు.

పురపాలక సంఘం కార్యాలయం - ఇచ్ఛాపురం

బహిరంగ వేలం ప్రకటన

ఆర్ఓసి నం. 1396/2024/ఎ1 | **తే. 07/02/2024 ది**

ఇచ్ఛాపురం పురపాలక సంఘంనకు సంబంధించిన ఈ దిగువ తెలిపిన గుత్తలను 2024-2025 సంవత్సరం అనగా తేది: 01.04.2024 నుండి తేది: 31.03.2025 వరకు గల కాలమునకు తేది:21.02.2024 బుధవారము ఉదయం 11:00 గంటలకు కమిషనరు వారిచే గాని, లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని పురపాలక సంఘం ఆవరణ లో బహిరంగ వేలం నిర్వహించబడును. సదరు వేలం పాట నందు పాల్గొనదలచిన పాటదారులు అందరూ గౌరవ జిల్లా కలెక్టర్, శ్రీకాకుళం వారు ఆమోదించిన గజిట్ నోటిఫికేషన్ నెం.48, తేది:11.01.2024 లోని నియమ, నిబంధనలకు లోబడి (బద్దులై) యుండవలెను. ఇతర వివరములకు ఆఫీసు పనిచేయు వేళలో రెవెన్యూ విభాగం నందు తెలుసుకోనవచ్చును.

నెం.	వేలం వివరము	ధరావత్తు రూ.లు	సాల్వెన్సీ ధృవీకరణ పత్రం
1	రోజువారి మార్కెట్ ఆశీలు వసూలు మరియు వీధి గుత్త, వీధులలో తిరిగి అమ్ముకొనుట పై రుసుము వసూలు చేసుకునే హక్కు	రూ.3,50,000/-లు	రూ.20,00,000/-లు
2	కమేళా నందు ఆశీలు వసూలు చేసుకునే హక్కు	రూ.15000/-లు	రూ. 50,000/- లు
3	పార్కు, లైబ్రరి మున్సిపల్ స్థలంలో ఉన్న కొబ్బరి చెట్ల ఫలసాయము పొందుకునే హక్కు	రూ.1500/-	రూ. 5000/- లు
4	లైబ్రరీలో వున్న పాత దినవార పత్రికలు పొందుకునే హక్కు	రూ. 1500/- లు	రూ. 5000/- లు

షరత్తులు:1. వేలం పాటలో పాల్గొనదలచిన వారు స్థిర ఆస్తుల పై సాల్వెన్సీ ధృవీకరణ పత్రం తో పాటు EC పత్రం లేదా తహశిల్దారు హెూదా తక్కువ కాని అధికారి వారిచే తేది: 08.02.2024 తదుపరి జారీచేసిన మోతుబరి ధృవపత్రం తో పాటు EC పత్రంను మరియు ధరవత్తు సొమ్మును వేలం పాట సమయమునకు ఒక గంట ముందు ఈ కార్యాలయమునకు దాఖలు / జమ చేయవలెను. **2.** మీరు సమర్పించిన సాల్వెన్సీ యొక్క ఆస్తి "ఒరిజినల్ డాక్యుమెంట్" ను పరిశీలన నిమిత్తం తీసుకొని రావలెను. **3.** సాల్వెన్సీ ధృవపత్రం బదులుగా ఎట్టి పరిస్థితులలోను డబ్బు స్వీకరించబడదు. **4.** ఎప్పటికప్పుడు ప్రభుత్వం వారు జారీచేయుచున్న ఉత్తర్వులు ననుసరించి సంబంధిత పన్నులను పాట సొమ్ముకు అదనంగా చెల్లించవలసియున్నది. **5.** హెచ్చు పాట ఆమోదించిన ఎడల, వెంటనే 1/4 వంతు పాట సొమ్మును కార్యాలయమునకు చెల్లించవలెను మరియు సబ్ రిజిస్ట్రర్ ఆఫీసు వారి రేట్లు అనుసరించి పాటదారుని సొంత ఖర్చులతో రిజిస్టర్ అగ్రిమెంట్ చేయించి ఇవ్వవలయును. **6.** వేలం పాటలో పాల్గొనదలచిన వారు ఈ పురపాలక సంఘంనకు ఎటువంటి బకాయిలు లేనట్లు ధృవపత్రం జతపరచవలెను. **7.** వేలం పాట రద్దు పరుచుటకు గాని ఖాయపరుచుటకు గాని కౌన్సిల్ వార్కి పూర్తి అధికారం కలదు.

సం/- కమిషనరు, ఇచ్ఛాపురం పురపాలక సంఘం.


వినతిపత్రం అందజేస్తున్న జీడి రైతుసంఘం నాయకులు

జీడికి గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి- పలాస

జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, 80 కేజీల జీడి పిక్కల బస్తా ధర రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించి రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఎపి జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. పలాస కంబిరిగాం కూడలి జాతీయ రహదారికు సమీపంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావంలో భాగంగా ఆదివారం ఎపి జీడి రైతు సంఘం ఆధ్వర్యాన టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస కేంద్రంగా రాష్ట్రంలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక పిక్కలను కొనుగోలు చేసిన తర్వాతే విదేశీ పిక్కల దిగుమతులకు అనుమతి ఇవ్వాలని కోరారు. జీడి తోటల్లో అంతర కృషి పరికరాలు ఉచితంగా రైతులకు అందించాలన్నారు. జీడి పరిశోధన కేంద్రాలు ప్రాంతాల వారీగా ఏర్పాటు చేయాలన్నారు. జీడి పంట విస్తరణకు, జీడి తోటలు పునరుద్ధరణకు ప్రభుత్వం రాయితీలు, ప్రోత్సాహకాలు అందించేలా కృషి చేయాలని కోరారు. ఉపాధి హామీ ద్వారా ఎకరా జీడి తోట అభివృద్ధికి మూడేళ్లకు రూ.94 వేలు రైతులకు క్షేత్రస్థాయిలో అందించాలన్నారు. జీడి పంటకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించాలన్నారు. జీడి పిక్కలు ఆరబెట్టేందుకు ఉచితంగా టార్పాలిన్లు అందించాలన్నారు. పై అంశాలను తెలుగుదేశం పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో రైతు ప్రతినిధులు కుత్తుం వినోద్, అంబటి రామకృష్ణ, రెయ్యా గణపతి బత్తిని భాస్కర్, శ్యామ్ పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండలం వల్లభరావుపేటలో నూతనంగా నిర్మించిన సచివాలయం, వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్ర భవనాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకే పరిపాలన అందించాలనే ఉద్దేశంతో సిఎం జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. రైతుల అభ్యున్నతకి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి ప్రతినిధి మైలపల్లి కామరాజు, సర్పంచ్‌లు, ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు రెడ్డి విశ్వేశరావు, జిల్లా మహిళా విభాగం జనరల్ సెక్రటరీ గురాన తిరుమల మానస పాల్గొన్నారు.

లావేరు: సచివాలయం వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని విజయనగరం పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలో బెజ్జిపురంలో రూ.61 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు జరగాలంటే మళ్లీ జగన్మోహన్ రెడ్డిని సిఎంగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఆర్.బాలకృష్ణ, జెడ్‌పిటిసి సీతంనాయుడు, మాజీ ఎంపిపి డి.రాజీనాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసురావు పాల్గొన్నారు.

అందరి చూపు ఆ గ్రామం వైపు

1900లో ఏర్పాటు చేసిన పాఠశాల

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న కనుగులవలస గ్రామం అన్ని రంగాల్లో ముందుండి అందరికీ ఆదర్శంగా నిలిచింది. ఆ గ్రామ యువతతో అక్షరాలు దిద్దించిన మొదటి వ్యక్తి బెండి చిట్టెయ్య మాస్టారు. 20 ఏళ్లపాటు గ్రామ విద్యార్థులకు పాఠాలను బోధించి ఉన్నత విద్యావంతులుగా, ఉన్నత స్థానాల్లో నిలబెట్టిన ఘనత ఆయనకే దక్కింది. తరువాత తండ్రిని ఆదర్శంగా తీసుకొని ఆయన కుమారులు బెండి కృష్ణారావు 20 ఏళ్లు, బెండి సూర్యనారాయణ పదేళ్లు విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి విద్యావంతులుగా తీర్చిదిద్దారు. గ్రామ పాఠశాలలో 50 ఏళ్లపాటు ఆ కుటుంబం నిస్వార్థ సేవలను అందించింది. గ్రామంలో ఏ తలుపు తట్టినా ఇద్దరు నుంచి ముగ్గురు ఉద్యోగులు ఉంటారు. కొంతమంది వైద్య నిపుణులుగా మరికొందరు ఇంజినీర్లుగా, మరి కొంతమంది శాస్త్ర సాంకేతిక విద్య పరిశోధకులుగా తయారు చేశారు. అప్పట్లో గ్రామ పెద్ద ఇంటి వరండాలో నడిచే పాఠశాలకు సమితి వైస్ ప్రెసిడెంట్‌గా విధులు నిర్వహించిన కీర్తిశేషులు బొడ్డేపల్లి రామ జోగినాయుడు పాఠశాల నిర్మాణం కోసం స్థలాన్ని ఇచ్చి 1900 లో పునాది వేశారు. పాఠశాలను నిర్మించి అక్షర కోవెలగా తీర్చిదిద్దారు. గ్రామానికి రహదారి లేకపోవడంతో రాత్రి, పగలు రైల్వేట్రాక్‌పై నడిచి గ్రామానికి చేరుకోవడానికి నానా ఇబ్బందులు ప్రజలు పడుతుండడాన్ని గమనించి ఆనాటి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కీర్తిశేషులు నూక పాపారావు, అప్పటి సర్పంచ్ నూక చంద్రరావు, బొడ్డేపల్లి ఆనందరావు, నారాయణరావు సొంత స్థలాలను ఇచ్చి ఆమదాలవలస నుంచి కనుగులవలస గ్రామానికి రహదారి నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు.

ప్రభుత్వ కొలువుల్లో ఎందరో...

అక్కడి పాఠశాలలో చదువుకున్న ఒకప్పటి విద్యార్థులు నేడు హెచ్‌ఎంలు, ఎంఇఒలుగా సేవలందిస్తున్నారు. విశాఖపట్నం కెజిహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ బెండి తేజేశ్వరరావు, కెజిహెచ్ న్యూరో సర్జరీ హెచ్‌ఒడి డాక్టర్ సీపాన గోపి, జిల్లాలో రిమ్స్‌లో సీనియర్ వైద్యులు డాక్టర్ బొడ్డేపల్లి సూర్యారావు, స్త్రీ ప్రసూతి వైద్యులు డాక్టర్ సంపదరావు శ్రీదేవి, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ సీపాన సోమశేఖర్, బయోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్త ఎన్.శ్రీరామ్మూర్తి, వైద్యో నారాయణో హరిగా కీర్తిగాంచిన వైద్యులు నూక భాస్కరరావు, నూక చంద్రశేఖరరావు, సామాజిక శాస్త్రవేత్త నూక సన్యాసిరావులు ఈ గ్రామానికి చెందిన వారే కావడం విశేషం. గ్రామంలో ఉపాధ్యాయులు 175 మంది, ఇంజనీర్లు 265 మంది, రైల్వే శాఖలో 180 మంది, వైద్యులు 120 మంది, బ్యాంకింగ్ రంగంలో 37 మంది, పోలీసులు 72 మంది, త్రివిధ దళాల్లో 56 మంది, ఇతర శాఖల్లో మరో 75 మంది విధులు నిర్వహిస్తున్నారు.

'నాడు-నేడు' కింద రూపుదిద్దుకుంటున్న పాఠశాల

ఉద్యమాలకు పురిటిగడ్డ

ఎపిటిఎఫ్ రాష్ట్ర బాధ్యులుగా సేవలందించిన సువ్వారి అచ్చెంనాయుడు, బొడ్డేపల్లి అప్పయ్య, జోగారావు, యుటిఎఫ్ సంఘ ప్రతినిధులు బొడ్డేపల్లి జనార్ధనరావు, మోహనరావు ఉద్యమాల్లో పాల్గొన్నారు. చౌదరి సంపూర్ణమ్మ, హనుమంతు రంగయ్యలు అప్పట్లో నక్సల్ బరి ఉద్యమంలో చేరి కొన్నాళ్లపాటు జైలు జీవితం గడిపి దళ నాయకులుగా అనేక పోరాటాల్లో పాల్గొని అజ్ఞాతంలో గడిపి జన స్రవంతిలోకి వచ్చారు. కమ్యూనిస్టు నాయకుడు చౌదరి తేజేశ్వరరావు అత్తగారి గ్రామం కనుగులవలసే. అప్పట్లో వంగపండు ప్రసాదరావు గ్రామాన్ని సందర్శించి రాత్రి కళాజాతను ఏర్పాటు చేసి తన పాటలతో యువతను ఉత్రూతలూగించి ఉద్యమాల వైపు నడిపించారని, పోలీసులు గ్రామంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసేవారిని పెద్దలు గుర్తు చేస్తుంటారు. ఆ గ్రామ చరిత్ర నేడు అందరికీ ఆదర్శంగా నిలిచింది. నేడు అందరి చూపు ఆ గ్రామం వైపే ఉన్నదనడంలో ఎటువంటి సందేహం లేదు.

క్రమశిక్షణతో చదువుకుని..

తమ గురువు బెండి కృష్ణారావు విద్యా బోధనతో ప్రభుత్వ పాఠశాలలో క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదిగి నేడు ఈ స్థాయిలో స్థిరపడ్డాం. ప్రాథమిక విద్యాభ్యాసం నుంచే తమ తల్లిదండ్రులు పడ్డ కష్టాలను దగ్గర నుంచి చూసి చదువుపై మక్కువతో ఇష్టపడి చదివి ప్రయోజకులుగా నిలిచాం. గ్రామానికి తనవంతు కృషి చేయడానికి ఎప్పటికీ సిద్ధంగా ఉంటాను. **- సీపాన గోపి, న్యూరాలజీ విభాగం అధిపతి ఆంధ్ర మెడికల్ కాలేజీ విశాఖపట్నం**

గురువులను ఆదర్శంగా తీసుకుని..

తమ తల్లిదండ్రులు అష్టకష్టాలు పడి తమను చదివించారు. మా గురువులను ఆదర్శంగా తీసుకొని నేడు ఈ స్థాయిలో ఉన్నాం. ఈ తరం యువత కూడా ముందు తరాన్ని ఆదర్శంగా తీసుకొని భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయులుగా నిలవాల్సిన అవసరం ఉంది.

- బొడ్డేపల్లి జనార్ధనరావు, యుటిఎఫ్ మాజీ నాయకులు

ఉపాధ్యాయ వృత్తిపై మమకారంతో..

అప్పట్లో తనకు ఎన్నో ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చినప్పటికీ తన తండ్రిని ఆదర్శంగా తీసుకొని ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న మమకారంతో ఇదే వృత్తిలో కొనసాగి ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దాను. చాలా మంది ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డ విద్యార్థులు తమ దగ్గరే చదువుకున్నామని పలువురు చెబుతుంటే ఎంతో ఆనందంగా ఉంది.

- బెండి కృష్ణారావు, విశ్రాంత ఎంఇఒ, కనుగులవలస

'హృదయం'కు బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డు

సోంపేట: ప్రజలకు విశేష సేవలు అందించిన హృదయం ఫౌండేషన్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావుకు హైదరాబాద్‌లోని విశ్వగురు వరల్డ్ రికార్డ్సు బెస్టు సోషల్ సర్వీస్ అవార్డును అందజేశారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు జడ్జి ఈ.వి.వేణుగోపాల్ అవార్డును అందజేశారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో సేవలందించిన 30 మందిని ఆ సంస్థ ఎంపిక చేయగా, అందులో హృదయం ఫౌండేషన్‌కు చోటు దక్కడం విశేషం. మండలంలోని నాయకులతు, ఉద్దానం ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఎఎస్ లక్ష్మీకాంతం, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఉమామహేశ్వరి, రాధ, టిఎంటి చైర్మన్ సునీల్ సరఫ్, సుప్రీం కోర్టు న్యాయవాది నేరేళ్ల మాల్యాద్రి, విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సిఇఒ డాక్టర్ సత్యవోలు, రాంబాబు పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు

అధికారుల్లేని సమావేశాలు ఎందుకు?

నిలదీస్తున్న ఎంపిటిసి రాజశేఖర్

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

అధికారులు హాజరు కాని సమావేశాలు ఎందుకు, మాకు మాత్రం వేరే పనులు లేవా? అంటూ జీయన్నపేట ఎంపిటిసి నంబాళ రాజశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ బయటకు వెళ్లిపోవటంతో సభ్యులందరూ ఒక్కక్కరిగా వాకౌట్ చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో ఎంపిపి రోణంకి ఉమ అధ్యక్షతన ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 27 శాఖలకు గాను, 11 శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. అందులోను అనేక సమస్యలకు

వాకౌట్ చేసిన సభ్యులు

పరిష్కరం చూడాల్సి రెవెన్యూ శాఖ గైర్హాజరు కావడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే 15వ ఆర్థిక సంఘం నిధులు పలు పంచాయతీలకు గాను రూ.1,41,54,532 నిధులు పంచాయతీ ఖాతాలో జమ చేశామని ఎంపిడిఒ పద్మజ తెలిపారు. యుద్ధప్రాతిపదికన వాటిని ఖర్చు చేస్తే... 16వ ఆర్థిక సంఘం నిధులు జమ అవుతాయని అన్నారు. వీటిని పంచాయతీలో విద్యుత్, పారిశుద్యం, తాగునీరు వంటి అవసరాలకు ఖర్చు చేయాని సభ్యులకు సూచించారు. అయితే అప్పటికే సభ్యులు ఒక్కొకరిగా వాకౌట్ చేశారు. దీంతో 8 శాఖలపైనే సమీక్ష నిర్వహించారు. అధికారులు సైతం చేసేంది ఏమి లేక సమావేశాన్ని అక్కడతో ముగించేశారు. సభ్యులమంతా అధికార పార్టీకి చెందిన వారుమని, గ్రామాల్లో ఏ విధమైన అభివృద్ధి పనులు చేయడానికి అధికారులు సహకరించకపోవడం సభ్యులు అవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, మండల ఉపాధ్యక్షులు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజా, రోణంకి మల్లయ్య, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.రాజు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న విజయ

అభివృద్ధి చేసి చూపించాం

ప్రజాశక్తి- కవిటి

నాలుగేళ్లలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన వైసిపి ప్రభుత్వం అంతేస్థాయిలో ప్రతి మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసినట్టు జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ తెలిపారు. మండలంలోని సహలాలపుట్టుగ పంచాయతీ బొంయితిపుట్టుగలో రూ.2.5 లక్షల ఎన్ఆర్‌జిఎస్ నిధులతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డు ప్రారంభించగా, రూ.2.20 లక్షలు జెడ్‌పి నిధులతో తాగునీటి బోరుకు ఆదివారం శంకుస్థాపన చేశారు. బెవరపుట్టుగలో రూ.5 లక్షలు జెడ్‌పి నిధులతో ఆలయ ప్రహరీకి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ యలమంచి నీలయ్య, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, సర్పంచ్‌లు లక్ష్మీప్రధాన్, దుగాన భద్రాచలం, బద్రి ప్రకాష్, ఎంపిటిసిలు పి.కృష్ణారావు, బి.దమయంతి, నాయకులు రవిప్రధాన్, బి.మురళి, వై.గోవింద్, డి.ధర్మారావు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జాతర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఈ నెల 18, 19, 20 తేదీల్లో నిర్వహించనున్న కమ్మ సిగడాం మహాలక్ష్మి తల్లి జాతరకు సంబంధించి పోస్టర్‌ను ఆలయకమిటీ ప్రధాన కార్యదర్శి నడుకుదిటి ఈశ్వరరావు, కమిటీసభ్యులు ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ జాతరకు సంబంధించి యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు వెలిచేటి రామకృష్ణ, రాజారవిచంద్ర, తేజ, కోశాధికారి వెలిచేటి రాజశేఖర్, కార్యదర్శి మన్నె లక్ష్మీ ప్రసాద్, సింహాచలరాయుడు, కృష్ణారావు, చినబాబు, బాబీ పాల్గొన్నారు.

సుమతి శతకం పద్యాన్ని చదువుతున్న విద్యార్థి

గ్రంథాలయంలో 'చదవడం మా కిష్టం'

ప్రజాశక్తి- లావేరు

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరుగుతుందని దీనిని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా హారిక, జితేందర్, కీర్తిప్రియ, వందన సుమతి శతకంలో పద్యాలను చదివి వినిపించారు. వీరికి గ్రంథాలయం తరుపున బహుమతులను అందజేశారు. కార్యక్రమములో గ్రంథాలయ సహాయకులు గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్ఞాపికను అందుకుంటున్న కృష్ణమూర్తిరెడ్డి

ప్రయివేటు స్కూళ్ల అభివృద్ధికి కృషి

ఇచ్ఛాపురం: ఎపి ప్రయివేటు స్కూళ్ల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎపి ప్రయివేటు స్కూళ్ల అసోసియేషన్ ఉపాధ్యక్షులు దక్కత కృష్ణమూర్తిరెడ్డి అన్నారు. తిరుపతిలో ఆదివారం నిర్వహించిన ఎపి ప్రయివేటు స్కూళ్ల అసోసియేషన్ సమావేశంలో ఇచ్ఛాపురానికి చెందిన శాంతి నికేతన్ విద్యా సంస్థల చైర్మన్ కృష్ణమూర్తిరెడ్డి ఉపాధ్యక్షులుగా నియమితుల య్యారు. అనంతరం మాట్లాడుతూ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన ఈ పదవికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తానని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు వి.సుందరం, కౌన్సెల్ ప్రెసిడెంట్ కె.చంద్రశేఖరరావు, స్టేట్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యరాజు, జిల్లా అధ్యక్షులు జనార్ధనరావు, గణపతిరావు, సింహాచలం, అప్పలచారి పాల్గొన్నారు.

రేపట్నుంచి దాతలకు పాసులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధిలో భాగస్వాములవుతున్న దాతలకు రథసప్తమి వేడుకల్లో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్టు ఆలయ ఇఒ డిఎల్‌వి రమేష్ బాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం నుంచి ఆలయ ప్రాంగణంలో ఉన్న ఇఒ కార్యాలయంలో డోనరు పాస్‌లను దాతలకు అందజేస్తామని తెలిపారు. ఒక్కో డోనర్ పాస్‌పై నలుగురికి ప్రవేశం కల్పిస్తామని, పాస్ తీసుకున్న వారికి 16వ తేదీ రాత్రి 12.30 నుంచి ఉదయం 7గంటల వరకు ప్రవేశం ఉంటుందన్నారు. ప్రత్యేక క్యూలైన్లలో వీరికి ప్రవేశం కల్పిస్తున్నట్టు తెలిపారు.

రూ.లక్ష విరాళం

సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నానికి చెందిన బి.వెంకట వ్యాస నగేష్, ఉష దంపతులు రూ.100116 విరాళంగా అందజేశారు. ఆదివారం ఆలయాన్ని సందర్శించిన వారు అనివేటి మండపంలో ఇఒ రమేష్‌బాబును కలసి చెక్కును అందజేశారు.

విరాళాన్ని స్వీకరిస్తున్న ఇఒ రమేష్‌బాబు

తొలి మాఘ ఆదివారం రద్దీ

ఆలయానికి మాఘమాసంలో రద్దీ అధికంగా ఉంటుంది. తొలి ఆదివారం కావడంతో యాత్రికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దీంతో ఆలయానికి ఒక్క రోజునే రూ.5.64లక్షల ఆదాయం సమకూరింది. టికెట్లు విక్రయాల ద్వారా రూ.2,05,200 విరాళాల రూపంలో రూ.1,33,521, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2,25,000 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఇఒ డిఎల్‌వి రమేష్ బాబు తెలిపారు.

మెమొంటోను అందజేస్తున్న హారికాప్రసాద్

విఠలేశ్వర్‌కు సత్కారం

శ్రీకాకుళం అర్బన్ : అమరికలు లేని స్వచ్ఛ మనస్తత్వం ఎఎస్‌పి తిరుపతి పాండురంగ విఠలేశ్వర్ సొంతమని పలువురు వక్తలు కొనియాడారు. నగరంలో 80 అడుగుల రోడ్డులో ఉన్న నార్తన్ సర్కస్ హోటల్‌లో ఆదివారం ఎఎస్‌పి టిపి విఠలేశ్వరరావును జిల్లా యునైటెడ్ ఎన్‌జిఒ ఆధ్వర్యాన ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా లైన్స్‌క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం హర్షవల్లి వ్యవస్థాపక అధ్యక్షులు కెఎన్ఎస్‌వి ప్రసాద్ (హారిక ప్రసాద్) మాట్లాడుతూ ఖాకీ దుస్తుల వెనుక కఠినత్వం ఉంటుందని, క్రైమ్ ఎఎస్‌పి అనగానే గాంభీర్యం ప్రదర్శిస్తారన్న భావనకు భిన్నంగా విఠలేశ్వర్ ఉన్నారన్నారు. మానవత్వం కలిగిన గొప్ప పోలీస్ అధికారన్నారు. సన్మానగ్రహీత విఠలేశ్వర్ మాట్లాడుతూ ప్రతి మనిషి అహంకారాన్ని వీడి మంచి తనంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో విఠలేశ్వర్ దంపతులను దుశ్శాలువతో, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ అభినందన సభలో జెసిఐ వ్యవస్థాపకులు జామి భీమశంకర్, మంత్రి వెంకటస్వామి, లైన్స్ క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి అధ్యక్షులు కరణం శోభారాణి, ప్రతినిధులు చింతాడ కృష్ణమోహన్, వావిలపల్లి జగన్నాథ నాయుడు, స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు జోగి నాయుడు, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ మేనేజర్ మణికంఠ పాల్గొన్నారు.

విద్యతోనే భవిష్యత్

సోంపేట : పిన్న వయసు నుంచే పిల్లలకు చదువుతో పాటు సంస్కారం సమపాళ్లలో అందించాలని జాగృతి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాంబుడ్డి గణపతి తల్లిదండ్రులను కోరారు. మండలంలోని కొర్లాంలో దుంపల మోహనరావు అధ్యక్షతన 'ఆధునిక తరం పిల్లలు-తల్లిదండ్రులు బాధ్యత'పై ఆదివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. చదువు, సంస్కారం, ఆర్థిక భద్రతపై వివరించారు. బాల్య వివాహాలు, ఆర్థిక దుబార ఖర్చులు, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో తామాడ మోహన్‌కుమార్, రాంబుడ్డి ఉమామహేశ్వర, పెద్దింటి చందు, బత్తిని బాలరాజు, గార కుర్మారావు, సంగారు ఢిల్లేశ్వరరావు, పి.ప్రతాప్, ఎస్.రము, పి.వసంత్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గణపతి

ఫ్లైఓవర్ వద్దు... బైపాస్ ముద్దు

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం మండల కేంద్రంలో ఫ్లైఓవర్ వద్దని వ్యాపారులు, స్థానికులు కోరుతున్నారు. ఆదివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్, గ్రామ పెద్దలు భవిరి రమణ, దెయ్యం శ్రీనివాస్, ఇడదాసుల తిరుపతిరాజు, అల్లు యుగంధర్ మాట్లాడుతూ జెఆర్‌పురం గ్రామ పంచాయతీలో కొన్ని తరాలుగా నివాసముంటున్నామని, ఊరు మధ్యనుంచి 16వ నెంబర్ జాతీయ రహదారి ఉందని, 20 ఏళ్ల క్రితం జాతీయ రహదారి నాలుగు లైన్లు విస్తరణ కోసం మా భూములను కొంతమేర కోల్పోయామని, మిగిలిన స్థలాల్లో శాశ్విత భవనాలు నిర్మించుకుని ఇప్పుడిప్పుడే చిరు వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే ఇటీవల జాతీయ రహదారుల సంస్థ, రెవెన్యూశాఖ సర్వే సిబ్బంది వచ్చి కొలతలు వేస్తున్నారని, రెండవసారి జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఫ్లైఓవర్ నిర్మాణం కోసం ఈ సర్వే చేస్తున్నట్టు తెలియజేస్తున్నారని, దీంతో జాతీయ రహదారికి ఇరువైపుల ఉన్న వ్యాపారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలిసారి విస్తరణలో ఆస్తులు కోల్పోయి, జీవనోపాధి కోల్పోయి వలసలు పోయారని, ఇప్పుడు ఫ్లైఓవర్ నిర్మాణం చేపడితే జీవనోపాధికి తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు. వెంటనే ఫ్లైఓవర్ నిర్మాణ ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఫ్లైఓవర్ వద్దు బైపాస్ ముద్దని నినాదాలు చేశారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేపడితే ఆందోళనలు, రాస్తారోకోలు, నిరహారదీక్షలు, కార్యాలయాల ముట్టడి చేపడతామని హెచ్చరించారు.

మాట్లాడుతున్న సర్పంచ్, గ్రామ పెద్దలు

'శంఖారావం'ను విజయవంతం చేయాలి

లావేరు : మాట్లాడుతున్న కళావెంకటరావు

ప్రజాశక్తి- లావేరు

టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సిఎం కావడం ఈ రాష్ట్రానికి ఎంతో అవసరమని మాజీమంత్రి, టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు అన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన శంఖారావం కార్యక్రమం ఈ నెల 15న లావేరులో నిర్వహించ నుండటంతో ఆదివారం సభాస్థలిని పరిశీలించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు పడుతున్న కష్టాలను తెలుసుకోవడానికి లోకేష్ యువగళం పాదయాత్ర చేపట్టారని, ఆ యాత్ర సాగనివ్వకుండా వైసిపి ప్రభుత్వం అనేక అడ్డంకులు సృష్టించినా లోకేష్ వెనుకడుగు వెయ్యకుండా యాత్రను విజయవంతం చేశారన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటి ఇంటికి వెళ్లి టిడిపి ఎన్నికలు మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాలను మహిళలకు వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, రణస్థలం మాజీ ఎంపిపి గొర్లె విజయనాయుడు, లంక శ్యామ్, పిన్నింటి భానోజీరావు, వెంకటరమణ, గంట్యాడ మహేష్ పాల్గొన్నారు.

పాతపట్నం : నారా లోకేష్ ఈ నెల 13న పాతపట్నంలో నిర్వహించనున్న శంఖారావంను విజయవంతం చేయాలని టిడిపి నాయకులు, పారిశ్రామిక వేత్త మామిడి గోవిందరావు కార్యకర్తల ను కోరారు. ఈయనతో పాటు ఐదు మండలాల నాయకులు, ఎంజిఆర్ శ్రేణులు ఉన్నారు.

ఆమదాలవలస: నేడు పట్టణంలో జూనియర్ కళాశాల మైదానంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం సభ సాయంత్రం 4 గంటలకు జరగనుందని జన సైనికులు ఈ సభలో పాల్గొని జయప్రదం చేయాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గ పరిధిలో నాలుగు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన జనసేన మండల నాయకులు, కార్యవర్గ సభ్యులు వీర మహిళలు ఈ సభలో పాల్గొని మద్దతు తెలియజేయాలని కోరారు.

పలువురికి ఆర్థికసాయం

పొందూరు: విశాఖపట్నం వద్ద ఇటీవల జరిగిన రహదారి ప్రమాదంలో మండలం మలకాం గ్రామానికి చెందిన తల్లిదండ్రులు కొండేటి శంకరరావు, ఝాన్సీలక్ష్మిలను కోల్పోయిన చిన్నారులకు అండగా నిలుస్తూ పలువురు ఆర్థికసాయాన్ని అందజేస్తున్నారు. ఇటీవల పలు పత్రికల ద్వారా విషయం తెలియడంతో గ్రామానికి వచ్చి చిన్నారులకు ధైర్యాన్ని చెబుతూ తమవంతు ఆర్థికసాయాన్ని అందిస్తున్నారు. ఆదివారం శ్రీకాకుళం శాంతినికేతన్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకున్న పూర్వ విద్యార్థులు (1995-97 బ్యాచ్) రూ.25,500లు, అలాగే రాజాం పట్టుశాలి సంఘం ప్రతినిధులు సంఘం తరుపున రూ.10వేలు ఆర్థికసాయాన్ని స్థానిక సర్పంచ్ జాడ శ్రీనివాసరావు, గ్రామపెద్దలు సమక్షంలో చిన్నారులకు అందజేశారు.

వజ్రపుకొత్తూరు: అగ్నిప్రమాదంలో గాయపడిన ఐదేళ్ల బాలిక సవర ఇంద్రజ కుటుంబానికి యువతరం సేవా సమితి సభ్యులు ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని లొత్తూరుకు వెళ్లి బాలిక తల్లిదండ్రులకు రూ.15 వేలు చెక్‌ను ఆదివారం అందజేశారు. పది రోజుల క్రితం తోటి పిల్లలతో ఆడుకుంటున్నప్పుడు అగ్నిప్రమాదానికి గురై 35 శాతం శరీరం కాలిపోయిందని తల్లిదండ్రులు సరుణమ్మ, సింహాద్రి తెలిపారు. తండ్రి పలాసలోని పారిశ్రామిక ప్రాంతంలో ఓ ఆయిల్ ఫ్యాక్టరీలో రోజు కూలీగా పనిచేస్తూ... కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజు వారి చికిత్స నిమిత్తం రూ.1500 నుంచి రూ.3 వేలు వరకు ఖర్చు అవుతుందని, పేదరికంతో బాధపడుతున్న బాలిక కుటుంబ సభ్యులు ఆర్థిక స్తోమత చాలక దాతల సహాయం కోరుతున్నారు. దీనికి స్పందించిన యువతరం సేవా సమితి సభ్యులు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు చింత మురళి, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి గొరకల సునీల్, వెంకటరమణ, లింగరాజు, లక్ష్మణరావు, దున్న జగ్గారావు, రవిజేత పాల్గొన్నారు.


పొందూరు : పరామర్శిస్తున్న పూర్వ విద్యార్థులు

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వైద్య శిబిరానికి స్పందన

సోంపేట: సోంపేటలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యాన స్థానిక గాంధీ మండపం కూడలి వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 580 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో కిడ్నీ వైద్యులు యర్ర రాకేష్, ఎముకల వైద్యులు పి.వి.నవీన్ కుమార్, గుండె వైద్యులు మల్లా ఫణీంద్ర, దంత వైద్యులు జ్యోతి బిసాయి పాల్గొని వైద్య సేవలు అందించారు. సర్పంచ్ నగిరి ప్రభావతి, ఐఎంఎ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.రాజేంద్రప్రసాద్, సెక్రటరీ డాక్టర్ ఎ.వి.రామకృష్ణ, లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ వైశ్య రాజు గోపి, సభ్యులు మల్లా కృష్ణ, జామి ఈశ్వరరావు, సానా ప్రశాంత్, బి.సుమన్, పింటూ వినోద్, కె.అఖిల్ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ మృతి

లావేరు : మండలంలోని తాళ్లవలస పంచాయతీ రావివలస జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మతిస్థిమితం లేని మహిళ మృతి చెందినట్లు ఎస్ఐ సిహెచ్.స్వామి నాయుడు తెలిపారు. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్లే రహదారిలో తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. మృతురాలి వయస్సు 55 నుంచి 60 మధ్యలో ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించామన్నారు.

లోకేష్ నోరు అబద్ధాల పుట్ట

ప్రజాశక్తి- నరసన్నపేట

కృష్ణదాస్

లోకేష్ నోరు ఒక పెద్ద అబద్ధాల పుట్టని, లోకేష్ పాదయాత్ర అట్టర్ ఫ్లాప్ కావడంతో మతి చెడి ఇష్టం నోటికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని వైసిపి జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర నుంచి శంఖారావం పేరుతో లోకేష్ చేస్తున్న యాత్ర టిడిపి శవయాత్ర అని అభివర్ణించారు. ఇచ్ఛాపురంలో అబద్ధాలు దంచికొట్టిన లోకేష్ తన తండ్రిలానే అబద్ధాలు చెబుతూ ప్రజల్ని మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీల్లో 99శాతం నెరవేర్చిందని గర్వంగా తాము చెప్పగలమన్నారు. చెప్పింది చేసే నేత జగన్ అని, వంచనకు, వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు అని లోకేష్ తెలుసుకోవాలన్నారు. మంచి జరిగితేనే ఓటు వేయండి అని చెప్పే జగన్మోహన్ రెడ్డికి, తన జీవితంలో ఏనాడు ఒంటరిగా పోటీ చేయలేక పొత్తుల పేరుతో ఢిల్లీకి వెళ్లి కాళ్లు పట్టుకునే చంద్రబాబుకు మధ్య ఉన్న తేడాను గమనించాలని హితవు పలికారు.

17న ఆనందోబ్రహ్మ

శ్రీకాకుళం అర్బన్ : సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం ధ్యానం వల్ల లభిస్తాయని ప్రజా పిత బ్రహ్మ పుత్ర సమాజం జిల్లా ఇన్‌ఛార్జి డి.ఉమామహేశ్వరి అన్నారు. ఆదివారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్‌తో కలిసి ఆమె మాట్లాడారు. నగర సమీపాన గల కల్లెపల్లి సాంప్రదాయం కళావేదికలో శ్రీ త్యాగరాజ స్వామి ధ్యాన ఆరాధనోత్సవా లు నిర్వహిస్తామని చెప్పారు. ఈవేడుకలకు నగరంలో ఉన్న అన్ని రంగాల ప్రముఖులు, వివిధ సంస్థల ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. త్యాగరాజ స్వామి కీర్తనలు వినటం వలన మనసుకు ఎంతో ఉల్లాసంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు జి.ఇందిరా ప్రసాద్, పి.జి.గుప్తా, శాసపు జోగినాయుడు, ఆర్.వి.ప్రసాద్, జి.లక్ష్మీ, వాసంతి, మల్లిబాబు, డాక్టర్ జివిఎస్.రావు, కొండలరావు పాల్గొన్నారు.

రామ్మోహనరావును సన్మానిస్తున్న గ్రామస్తులు

రామాలయ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలో మూల సవళాపురం పంచాయతీ పరిధిలో తురకపేట రామాలయ విగ్రహ ప్రతిష్టలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాలయ విగ్రహ ప్రతిష్టలో శ్రీరాముని సేవలో తాను కూడా పాలుపంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పైడి మురళీమోహన్, సర్పంచ్ తర్లాడ ఈశ్వరరావు, మీసాల రమణమూర్తి, సాయి అప్పలరాజు, వాసు, మధు, లోకేష్, రాజారావు, గాంధీ పాల్గొన్నారు.

పార్కులో సందడే సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. వేసవి ప్రారంభం కావడంతో పర్యాటకులు కాసేపు సేద తీర్చుకుందామని వేసవి విడిది చేద్దామని పార్కులో పర్యాటకులు సందడి చేశారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పర్యాటకులు తరలివస్తున్నారు. పార్కులోని అందాలను ఆశ్వాదించారు.

జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. జెయింట్ వీల్ ఎక్కి ఉయ్యాల ఊగారు. చిన్నారులు కమాండ్ నెట్ ఎక్కి సరదాగా ఆడుకుంటూరు. మినీ ట్రైన్ ఎక్కి ఎంచక్కా ఆడుకున్నారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కర్లు కొట్టారు. అనంతరం మెట్టగూడ జలపాతాన్ని సందర్శించారు.

గౌతు కుటుంబం చేసిన అభివృద్ధి ఏమిటి ?

ప్రజాశక్తి- పలాస

గౌతు లచ్చన్న నుంచి శివాజీ వరకు సుమారు 60 ఏళ్ల పరిపాలించి ఈ ప్రాంతాన్ని ఏమి అభివృద్ధి చేశారో చెప్పగలరా అంటూ రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రశ్నించారు. శివాజీనగర్‌లో ఆదివారం అప్పలరాజు సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గౌతు లచ్చన్న దేశ స్వాతంత్ర్యం కోసం పాటుపడితే ఆయన కుమారుడు శివాజీ, మనవరాలు శిరీష ఈ ప్రాంత ప్రజలను బానిసలుగా చూస్తున్నారని ఆరోపించారు. జిల్లా వెనుకబాటు తనానికి గౌతు కుటుంబసభ్యులే కారణమన్నారు. తాను రూ.660 కోట్లు అవినీతి చేశానని ప్రతి సమావేశంలో ఆరోపించడం పద్ధతి కాదన్నారు. ఇకపై ఎవరైనా ఆరోపిస్తే ఇంటికి వచ్చి వసూలు చేస్తానన్నారు. వలసలు తగ్గించాలనే ఉద్దేశ్యంతో పోర్టు నిర్మాణం చేపట్టి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. టిడిపి హయాంలో వ్యాపారులు భయభ్రాంతులకు గురిచేస్తే నేడు తన హయాంలో వ్యాపారులు ప్రశాంతంగా వ్యాపారులు చేసుకుంటున్నారన్నారు. మున్సిపాలిటీలో ఇంటింటికి తాగునీరు అందించేందుకు రూ.110 కోట్లు వ్యయంతో పనులు జరుగుతున్నాయని, మరో ఆరు నెలల్లో పూర్తి చేసి తాగునీటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ కుమార్, బడగల బల్లయ్య, అంబటి ఆనంద్, సనపల సింహాచలం, బల్ల శ్రీనివాసరావు, పప్పల ప్రసాద్, తాళాసు ప్రదీప్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి అప్పలరాజు

ఐక్యతతో అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని పద్మశాలి సామాజిక వర్గమంతా ఒక తాటిపైకి వచ్చి ఐక్యతతో మెలిగి అవకాశాలను అందిపుచ్చుకోవాలని జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షులు పసగాడ రామకృష్ణ తెలిపారు. నగరంలో ఎన్‌జిఒ హోంలో ఆదివారం భక్త మార్కండేయ జయంతి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సోమవారం భక్త మార్కండేయ జయంతి ఉత్సవం నిర్వహించాల్సి ఉందని, అయితే ఒకరోజు ముందుగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఏడాది ఈ ఉత్సవాన్ని ఆనవాయితీగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం పసగాడ రామకృష్ణ, చింతలపూడి కిరణ్ కుమార్, లబ్బ శ్రీనివాస్‌ల సౌజన్యంతో రూపొందించిన జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం కేలండర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల మంది పద్మశాలీలు ఉన్నారని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పద్మశాలి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు తీడ ప్రసాదరావు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ పందిరి చిన్నారావు, సెక్రటరీ యశో శ్రీనివాసరావు, నూలు నారాయణరావు, చిట్టి, తారకేశ్వరరావు, గుడే సూర్యనారాయణ, మొండి రాము, పసగాడ భారతి, గుడే దమయంతి, గుడే లక్ష్మీ పాల్గొన్నారు.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న రామకృష్ణ

జర్జంగిలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని జర్జంగి గ్రామ ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని టెక్కలి నియోజకవర్గ జనసేన నాయకులు పల్లి కోటేశ్వరరావు ఆరోపించారు. స్థానిక జనసేన నాయకుడు జీరు భాస్కర్, జనసైనికులు ఆహ్వానం మేరక మండల అధ్యక్షుడు పాగోటి అనిల్ కుమార్ అధ్యక్షతన ఆదివారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల పడుతున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రానికి కూడవేటు దూరంలో ఉన్న జర్జంగిలో అభివృద్ధి శూన్యమని, ముఖ్యంగా ప్రజలకు తాగునీరు లేకపోవడం, వాటర్ ట్యాంకు ఉన్న నిరుపయోగంగా ఉండడంతో నీటికి కోసం అవస్థలు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో జీరు భాస్కరరావు, కిశోర్, శంకర్, శ్యాం, మురళి, యోగి, మల్లేష్, టిడిపి నాయకులు శేఖర్ , రాము, జయరాం, శివ, ఈశ్వర్, మండల జనసేనా నాయకులు చందు, సందీప్, వినోద్, ప్రసాద్, ఉదయ్, హరి, సింహాద్రి పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

రంగస్థల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న త్రినాథరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మార్చి 27న జరగనున్న ప్రపంచ రంగస్థల కళాకారుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షులు బేకి త్రినాథరావు తెలిపారు. ఆదివారం పట్టణంలో లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాలలో కళాకారుల సంక్షేమ సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కళాకారుల సంక్షేమానికి కళాకారుల సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి బగాది వెంకటరావు, గౌరవ అధ్యక్షులు బంకుపల్లి శ్రీరామచంద్రమూర్తి శర్మ, సహాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావు, ఉపాధ్యక్షులు లక్ష్మణరావు, సభ్యులు ఎన్.చంద్రశేఖరరావు, రామాచారి, బి.శ్రీనివాసరావు, పి.గోవిందరావు, కె.రాములు పాల్గొన్నారు.

టిడిపిదే అధికారం : కళా

ప్రజాశక్తి- పాలకొండ

రానున్న ఎన్నికల్లో టిడిపి జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కళావెంకట్రావు అన్నారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయకృష్ణతో కలిసి చైతన్య రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఈ ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పటం తథ్యమన్నారు.

కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు గంటా సంతోష్, నాయకులు కర్నేన అప్పలనాయుడు, సుంకర అనిల్, అంపోలు శ్రీను తదితరులు ఉన్నారు.

దీక్షలో పాల్గొన్న బెజ్జిపుట్టుగ సర్పంచ్ తదితరులు

కొనసాగుతున్న దీక్షలు

ప్రజాశక్తి- కవిటి

గుర్తింపు, తమ భవిష్యత్ భరోసా కోసం బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 46వ రోజుకి చేరుకున్నాయి. అందులో భాగంగా దీక్షలో బెజ్జిపుట్టుగ సర్పంచ్ ఎస్.పి.నారాయణస్వామి తదితరులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. అనంతరం బెంతు ఒరియాల ప్రతినిధి కృష్ణ దలై మాట్లాడుతూ బంతుఒరియాలకు గుర్తింపు లేకపోవడంతో విద్యార్థుల ఉన్నత చదువులు, నిరుద్యోగుల ఉపాధి గాల్లోపెట్టిన దీపంలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని అన్నారు. గుర్తింపు, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాము దలై, రఘు దలై, జయరాం దలై, వెంకటరావు మజ్జి, విజయ్ దలై పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న కృపారాణి

కృపారాణి పరామర్శ

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని కొత్తపేటకు చెందిన వైసిపి నాయకులు, సర్పంచ్ ప్రతినిధి రామపాత్రుని ముకుందరెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి ఆదివారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా ముకుందరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈమె వెంట వైస్ ఎంపిపి దుక్క రోజా, రామకృష్ణ, మైనారిటీ సెల్ అధ్యక్షుడు, మండల కోప్షన్ మెంబరు షేక్ రాజు, లింగమూర్తి ఉన్నారు.

అవార్డును అందుకుంటున్న రాజారావు

'కుప్పిలి'కి వరించిన అవార్డు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణానికి చెందిన అభ్యుదయ రచయిత, కవి కుప్పిలి రాజారావుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృత తెలుగు అకాడమీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. ఆదివారం విజయవాడలో మల్లెతీగ మాసపత్రిక సంపాదకుడు కలిమిశ్రీ నిర్వహించిన రాష్ట్రస్థాయి కవితల పోటీల్లో ఈ అవార్డును ఆయన సొంతం చేసుకున్నారు. వంద మంది కవులు పాల్గొన్న ఈ పోటీల్లో కుప్పిలి రాజారావు రచించిన 'మన్నించు మా జనయిత్రి' కవిత టాప్‌టెన్‌లో నిలిచింది. ఆదివారం విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయంలో జరిగిన సభలో లక్ష్మీపార్వతి చేతులమీదుగా మెమెంటో, నగదు, ప్రశంసా పత్రం అందుకున్నారు.